ఆగమేఘాలపై కొయినా?

- నీళ్ల కోసం మహారాష్ట్రతో అంతరాష్ట్ర ఒప్పందానికి యత్నం
- ట్రిబ్యునల్ కేటాయింపులను అడగాలని తెలంగాణ నిర్ణయం
- పలు అంశాలపై స్పష్టత కరువు.. అయినా ప్రభుత్వం ఉరుకులు
- ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశం

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): కొయినా డ్యామ్ నీళ్ల కోసం మహారాష్ట్ర సర్కారుతో అంతరాష్ట్ర ఒప్పందం చేసుకోవాలని తెలంగాణ సర్కారు యోచిస్తున్నది. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్టు తెలుస్తున్నది. దీనిపై ఎలాంటి స్పష్టత లేకుండా ఎలా? అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మహారాష్ట్రలోని కొయినా డ్యామ్ నుంచి 30 టీఎంసీల నీటిని కోరేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడం, అది అనేక వ్యయప్రయాసలతో కూడుకున్నదని అధికారులు నివేదించడం విదితమే. అయినా కొయినా నీళ్ల కోసం ప్రత్యేకంగా మహారాష్ట్రతో అంతరాష్ట్ర ఒప్పందం చేసుకోవాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది.

శాశ్వత ప్రాతిపదికపై?

కృష్ణా నది ఉపనది కొయినాపై పశ్చిమ కనుమల్లో మహాబలేశ్వర్ దక్షిణ ప్రాంతంలో కొయినా డ్యామ్‌ను నిర్మించారు. దీని నీటి నిల్వసామర్థ్యం 105 టీఎంసీలు. అందులో 30 టీఎంసీలను సాగు, తాగునీటి అవసరాలకు కేటాయించుకుకోగా, మరో 67.5 టీఎంసీలను జలవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రానికి కేటాయించారు. ఏటా ఆ జలాలతో 4 దశల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. అందుకు ట్రిబ్యునల్ -1 కూడా ఆమోదించి మహారాష్ట్రకు రక్షణ కల్పించింది. కృష్ణాబేసిన్‌లో తీవ్ర నీటి ఎద్దడి నేపథ్యంలో కొయినా నుంచి జలవిద్యుత్తు ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్న జలాలను తూర్పు వైపునకు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదనలు చేస్తున్నది. ఇప్పటికే కేంద్ర జల్‌శక్తి శాఖను కూడా సంప్రదించినట్టు విశ్వసనీయ సమాచారం.

స్పష్టత కరువు

జలవిద్యుత్తు ఉత్పత్తి ద్వారా వచ్చే మొత్తానికి సమానమైన కరెంటును, లేదంటే డబ్బును అందిస్తామని తెలంగాణ సర్కారు చేస్తున్న ప్రతిపాదనకు మహారాష్ట్ర ఒప్పుకుంటుందా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే మహారాష్ట్ర సర్కారు ఎప్పుడంటే అప్పుడు విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే అవకాశం కొయినా డ్యామ్ వద్ద ఉన్నది. ఒక టీఎంసీ నీటితో అత్యధికంగా 40 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసుకుంటున్నది. మహారాష్ట్రలోని సతారా, సోలాపూర్, సాంగ్లి జిల్లాల తాగు, సాగునీటి అవసరాలను తీర్చడంలో కొయినా డ్యామ్ కీలకపాత్ర పోషిస్తున్నది. ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలను మహారాష్ట్ర వదులుకునేందుకు సిద్ధపడుతుందా? అనేది ఒక ప్రశ్న. కొయినా డ్యామ్ నుంచి తెలంగాణ దాదాపు వెయ్యి కిలోమీటర్లకుపైగా దూరం. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్‌తోపాటు అనేక ఆనకట్టలు, పదుల సంఖ్యలో ఉన్న కేటీ వియర్లను దాటుకొని జలాలు రావాల్సి ఉంటుంది. ఎక్కువ నీరు దారిలోనే నష్టపోవాల్సి ఉంటుంది. కొయినా నుంచి నీటిని తెచ్చినా వాటి విడుదలకు కర్ణాటక ఒప్పుకుంటుందా? అనేది మరో సందేహం. శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులు. ఆ రెండు డ్యామ్‌లలోకి జలాలను తీసుకువస్తే ఏపీ వినియోగించుకోకుండా ఉంటుందా? అంటే అనుమానమే. తమకు లబ్ధి చేకూరుతుందనే కోణంలో కర్ణాటక, ఏపీ అంగీకరించినా తెలంగాణతోపాటుగా పరిహారంగా నిధులను చెల్లిస్తాయా? అనేది మరోప్రశ్న. కొయినా జలవిద్యుత్తు ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ 1 మొత్తంగా 67.5 టీఎంసీలను కేటాయించగా, ట్రిబ్యునల్ 2 కూడా 65 శాతం డిపెండబులిటీపై 25 టీఎంసీలను కేటాయించింది. ఆ కేటాయింపులను కర్ణాటక, ఏపీ, తెలంగాణ సుప్రీంకోర్టులో, ట్రిబ్యునల్ 2లో సవాల్ చేశాయి. ఆ అంశంపై విచారణ కొనసాగుతున్నది. ఇలా అనేక అంశాలతో ముడిపడి ఉన్నా, ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే నీళ్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించడం గమనార్హం. ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కోయినా నీళ్ల కోసం అంతర్గత కమిటీ

కోయినా నుంచి నీళ్ల కోసం మహారాష్ట్రతో సంప్రదింపులకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఒక అంతర్గత కమిటీని నియమించింది. ఈ కమిటీలో శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సల్లా విజయ్‌కుమార్, పీ విజయ్‌కుమార్ ఉన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి కొరత దృష్ట్యా ఎగువన మహారాష్ట్రలోని కోయినా డ్యామ్ నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ సముద్రంలోకి విడుదల చేస్తున్న జలాలను దిగువకు విడుదల చేయాలని తెలంగాణ ప్రతిపాదిస్తున్న విషయం తెలిసిందే. తాత్కాలికంగానే కాకుండా శాశ్వతంగా ఆ మేరకు ఒప్పందం చేసుకోవాలని యోచిస్తున్నది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాగునీటిశాఖ అధికారులను ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సర్కారుతో ఆ దిశగా సంప్రదింపులు జరిపేందుకు సాగునీటి పారుదలశాఖ అంతరాష్ట్ర జలమండలి అధికారులను ప్రత్యేకంగా నియమించింది.

నెర్రెలుబారిన మాగాణం

ప్రాజెక్టుల నీళ్లందక రైతుల తండ్లాట.. బావుల పూడిక తీసే క్రేన్లకు గిరాకీ

- పది సంవత్సరాల నాటి దారుణ పరిస్థితులు రైతులకు పునరావృతం
- ఇన్నేండ్లకు వ్యవసాయ బావుల్లో పూడిక తీసుకుంటున్న రైతులు
- నారాయణపూర్ ఆయకట్టు పంట పొలాలకు నీటి కటకట
- ఎల్లంపల్లి నీళ్లు రాక 6 మండలాల్లో ప్రశ్నార్థకంలో 27వేల ఎకరాల సాగు

వెంకటాయపల్లి శివారులో తిరుపతి బావిలో పూడిక తీసేందుకు ఏర్పాటు చేసిన క్రేన్

కరీంనగర్, జనవరి 28 (నమస్తే తెలంగాణ)/గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్‌కు ప్రతి ఏటా ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, బోయినపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాల్లోని 57 చెరువులను నింపుతున్నారు. ఈ నీటితో ఆరు మండలాల్లోని దాదాపు 27 వేల ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండేవి. గతంలో జనవరి మొదటి, రెండోవారంలోనే నీళ్లు విడుదల చేసేవారు. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో పుష్కలంగా నీళ్లున్నా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం వద్ద పైప్‌లైన్ మరమ్మతు సాకుతో నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీళ్లివ్వడం లేదు.

ఎమ్మెల్యే చెప్పడంతోనే నార్లు

నీళ్లిస్తాం.. నార్లు పోసుకోమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పడంతోనే తామంతా నార్లు పోసుకున్నామని రైతులు చెప్తున్నారు. ఇప్పుడేమో సమయానికి నీళ్లు వదలకపోవడంతో నార్లు ముదిరిపోతున్నాయని, భూగర్భ జలాలు ఇంకిపోతుండడంతో బావుల్లోనూ నీళ్లు ఉండడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యే ఆ మాట చెప్పక పోయి ఉంటే తాము నార్లు వేసుకుని ఉండే వాళ్లం కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుక్కుల కోసం ట్రాక్టర్లకు వేలకువేలు ఖర్చు చేశామని, నార్లకు రెండుసార్లు మందులు వాడామని, ఇప్పుడీ పెట్టుబడి అంతా భారంగా మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు రావని మొదటే చెప్పి ఉంటే బావుల కింద ఉన్న నీటితోనే ఎంతో కొంత సాగుచేసుకుని ఉండేవారమని కుర్మపల్లి రైతులు పేర్కొన్నారు.

కేసీఆర్ చొరవతో సస్యశ్యామలం

2016లో కేసీఆర్ ప్రభుత్వం ఎల్లంపల్లి ద్వారా నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించడం ప్రారంభించిన తర్వాత ఈ ప్రాంత భూములు సస్యశ్యామలమయ్యాయి. రైతులు ఏటా రెండు పంటలు పండించుకుంటున్నారు. ప్రతి పసలుకు రైతుల అవసరాన్ని గుర్తించి నీటిని విడుదల చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రాజెక్టు ద్వారా నీళ్లు రాకపోవడంతో బావుల్లో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోతున్నాయి. మరోదారి లేక రైతులు ఇప్పుడు క్రేన్లతో బావుల్లో పూడిక తీసుకుంటున్నారు. కుర్మపల్లిలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి.

దారుణంగా కుర్మపల్లి పరిస్థితి

నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుర్మపల్లికి ప్రతి సీజన్‌కు అవసరమైన నీళ్లు వచ్చేవి. చెరువులు నింపుకుని రైతులు పంటలు సాగు చేసుకునే వారు. నారాయణపూర్‌లో ఇప్పుడు 20 శాతం నీళ్లు కూడా అందుబాటులో లేక పోవడంతో పైనున్న గ్రామాల రైతులే సాగునీరు లేక అల్లాడుతున్నారు. చివరి గ్రామమైన కుర్మపల్లి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సాగునీటి కష్టాలు రైతులను వేధిస్తున్నాయి. నీళ్లిస్తామని ఎమ్మెల్యే సత్యం చెప్పడంతో నార్లు వేసిన రైతులు, ఇప్పుడు నీళ్లిచ్చినా నాట్లు వేసే పరిస్థితి లేదని, అవన్నీ ముదిరిపోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా నీళ్లిస్తే వేసిన కొద్ది పాటి పంటలనైనా కాపాడుకుంటామని రైతులు కోరుతున్నారు. ఇంకొందరు రైతులు దున్నిన దుక్కులను, నారు మళ్లను వదిలేసుకుంటున్నారు. గ్రామానికి చెందిన రైతు ఇరుమల్ల కొంరయ్య రూ.లక్ష ఖర్చుచేసి పూడిక తీయడమే కాకుండా బావిలో సైడ్ బోరు వేయించినా సరిపడా నీళ్లు రాకపోవడంతో 20 గుంటల పొలాన్ని వదిలేశాడు. దానె సతీష్ అనే మరో యువరైతు రూ. 30 వేలు ఖర్చు చేసి పూడిక తీయించినానీళ్లు సరిపోవడం లేదు. ఆదివారం నుంచి నీటిని విడుదల చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించినా అధికారుల నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. రిజర్వాయర్ నిండాలంటే వారం నుంచి పది రోజులు పడుతుందని, అప్పటి వరకు పంటలను ఎలా రక్షించుకోవాలో అర్థం కావడం లేదని కుర్మపల్లి, వెంకటాయపల్లి గ్రామాల రైతులు వాపోతున్నారు.

ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలి

నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుర్మపల్లి వద్ద ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బతుకులు మారుతాయని నమ్మి ఓట్లు వేసిన రైతులను ప్రభుత్వం మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి నార్లు పోసి, నాట్లు వేస్తే నీళ్లు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు వెంటనే నీళ్లివ్వకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని రవిశంకర్ హెచ్చరించారు.

ఇన్నేండ్లు క్రేన్ల అవసరమే రాలే

కేసీఆర్ సర్కారు ఉన్నన్ని రోజులు రందిలేకుండా మూడెకరాల్లో వరి సాగుచేసుకున్న. ఇన్నేండ్ల కాలంలో మాకు బాయిల్లల క్రేన్లతో పూడికతీసే అవసరమే రాలే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నాలుగొద్దులు కాలేదు కానీ నీళ్ల కోసం మస్తు గోసైతంది. పొలాలను చూస్తే దుఃఖమైతంది. పెట్టుబడి కూడా రాకుండా అయితంది. ఇక్కడి నుంచి గెలిచిన ఎమ్మెల్యే ఇటు ముఖానే రాలే. ఎల్లంపల్లి నుంచి నీళ్లు ఇడుస్త లేరు. రేపు, మాపు అనుకుంట దాటేస్తున్రు. నీళ్లు ఇత్తరా? ఇయ్యరా? పురాగ చెప్తలేరు.

- మొట్టె ఓదెలు, కుర్మపల్లి, కరీంనగర్

బావిలో పూడిక తీసి ఏం ఫాయిదా?

నారాయణపూర్ నుంచి నీళ్లు వస్తాయన్న నమ్మకంతో ఉన్న ఐదెకరాల్లో ఈసారి మూడెకరాల్లో నాట్లు వేశా. నీళ్లు రాక పంట ఎండిపోవడంతో వారం కిందటే రూ. 30 వేలు ఖర్చు చేసి బావిలో పూడిక తీయించా. నారాయణపూర్ డీ-4 కాలువకు ఆనుకుని బావి ఉండడంతో కొంత ఊట వస్తోంది. వారం పది రోజుల్లో కాలువ నీళ్లు రాకపోతే ఈ మాత్రం నీళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. సకాలంలో నీళ్లు వస్తే మాకు ఈ కష్టాలు ఉండేవి కాదు.

-దానె సతీశ్, కుర్మపల్లి

ఎమ్మెల్యే నీళ్లిస్తనని చెప్పిండు

ఓట్లపుడు మా ఊళ్లెకు వచ్చినపుడు ఇప్పటి ఎమ్మెల్యే నారాయణపూర్ నీళ్లిస్తనని చెప్పిండు. డిసెంబర్ పత్తార్‌ఝి సందే ఇస్త మన్నడు. ఇప్పటి వరకు నీళ్లు రాలే. కుర్మపలికాడి బాయిల పూడిక తీయించి సైడ్ బోరు ఏయించిన. లక్ష రూపాయలై నయ్.

అయినా నీళ్లస్తలేవని నాటేసిన 20 గుంటల మడి ఇడ్సిపెట్టిన. ఎంకటయపల్లి శివారుల సుతం నాకు భూమి ఉన్నది. ఇక్కడి బాయిల సుతం నీళ్లు ఎన్కకువడ్తున్నయి. రేపుమాపైతే ఆయింతకు నీళ్లచ్చేతట్టు లేవు. కేసీఆర్ ఉన్నపుడు గిట్ల ఎప్పుడు కాలే. ఓడిపోయి రెండు నెలలన్న కాకపాయే మా రైతులకు కష్టాలు మొదలయ్యే.

- ఇరుమల్ల కొంరయ్య, కుర్మపల్లి రైతు

మూడొద్దులకో మడి పారుతంది..

నాకున్నది రెండెకరాలే. నారాయణపూర్ నీళ్లస్తయని నమ్మకంతోని అయింత నాటేసిన. ఇప్పటి వరకు నీళ్లు రాలే. బావిల నీళ్లు అడుగువడ్తన్నయి. మూడొద్దులకో మడి పారిచ్చుకుంటన్న. ఆఖరి మడి పారేవరకు మొదటి మడి ఎండుతది. మా ఊళ్లె కొందరు నారాయణపూర్ చెరువుకు మోటర్లు పెట్టి పొలాలు పారిచ్చుకుంటండ్రు. ఇట్ల ఎన్ని దినాలు పారిచ్చుకుంటం. ఏసిన పంట చేతికి రావాల్నంటే నారాయణపూర్ చెరువు నింపాలే.

- బైరి నర్సయ్య, లక్ష్మీదేవిపల్లి రైతు

రాడార్‌పై ఇక రణమే!

మొదటిపేజీ తరువాయి...

తీర్మానించారు. దామగుండంలో నేవీ రాడార్ ఏర్పాటుపై దామగుండం అడవి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'ప్రకృతి విధ్వంసం-పరిణామాల'పై ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ బాంక్వెట్ హాల్‌లో తొలి చర్చావేదిక జరిగింది. ఇందులో పలు తీర్మానాలు చేయడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.

ఊరూరా పోరాటం

రాడార్ ఏర్పాటు నిర్ణయానికి వ్యతిరేకంగా వారం, పది రోజుల్లో సుప్రీంకోర్టుకు వెళ్తామని, అక్కడ న్యాయం జరుగకపోతే అంతర్జాతీయ కోర్టుకు.. ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలని ఎన్జీటీ (జాతీయ హరిత ట్రిబ్యునల్)ను కూడా ఆశ్రయిస్తామని దామగుండం అడవి పరిరక్షణ సమితి నేతలు ప్రకటించారు. రాడార్ కేంద్రం చుట్టూ 7 కిలోమీటర్ల వరకు గ్రామాలను ఖాళీచేయాల్సి వస్తుంది. 30 కిలోమీటర్ల మేర రేడియేషన్ ప్రభావం ఉండనున్న దృష్ట్యా రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఊరూరా ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని నిర్ణయించారు. రేడియేషన్ వల్ల పుట్టుకతోనే క్యాన్సర్ రావడం, మతిభ్రమించడం, గాలి, నీరు కలుషితం కావడం, మనుషులు రోగాల బారిన పడటం వంటి దుష్పరిణామాలు కలుగుతాయని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఊరూరా కరపత్రాలు పంపిణీ చేయాలని తీర్మానించారు. ఒక రోజు వికారాబాద్ జిల్లా బంద్‌కు పిలుపునివ్వడంతోపాటు 5 వేల మంది విద్యార్థులతో మానవహారం, కలెక్టరేట్‌ను ముట్టడించి పాలనను స్తంభింపజేసి ప్రభుత్వానికి తెలిసేలా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. రాడార్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు అన్ని పార్టీలను కలవాలని, ప్రధాని మోదీకి వినతిపత్రం అందించాలని నిర్ణయించారు. దామగుండం అటవీ ప్రాంతంలో 50-60 శాతం మేర చెట్లు లేవని, 0.4 శాతమే అటవీ విస్తీర్ణం ఉన్నదని పలు నివేదికలతో కోర్టును తప్పు దోవపట్టించారని.. ఆ మోసాలను బయటపెట్టి దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ దట్టమైన అటవీ ప్రాంతమని, చాలా అరుదైన పక్షిజాతులతోపాటు కొండ గొర్రె ల్లాంటి జంతువులున్నాయనేది కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అంతేకాకుండా ఔషధ మొక్కలను నరకొద్దని రాజ్యాంగంలో ఉన్నదని, ప్రజాభిప్రాయం లేకుండా వికారాబాద్ ప్రజలు చచ్చినా బతికినా సంబంధం లేదని రాడార్ కేంద్రం ఏర్పాటు చేయడం సమంజసం కాదని, ఈ కేంద్రంతో నీరు, గాలి కలుషితమవుతాయన్న విషయాన్ని ప్రపంచ శాస్త్రవేత్తలందరూ గుర్తించారని పేర్కొన్నారు.

ప్రకృతి నాశనం ప్రమాదకరం

ప్రభుత్వం మారిన వెంటనే తెలంగాణ ప్రాణవాయువైన, నదికి పుట్టినిల్లు అయిన వికారాబాద్ అడవులను అప్పనంగా అప్పజెప్పారని వక్తలు మండిపడ్డారు. ఈ అడవిలో లక్షల కోట్ల విలువైన ఔషధ మొక్కలున్నాయని, 258 రకాల పక్షిజాతులున్న దామగుండం అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని నొక్కి చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హరితహారం ద్వారా కోట్ల మొక్కలు నాటగా, ప్రస్తుత ప్రభుత్వం దట్టమైన అడవిని నాశనం చేయడం సరికాదని అన్నారు. దేశంలో దామగుండం ప్రాంతం ఒక్కటే ఎత్తైన ప్రదేశం కాదని, దేశంలో 360 అడుగుల ఎత్తైన ప్రదేశాలు 10-15 ఉన్నాయని తెలిపారు. బెంగళూరులోని కోలార్ గనుల ప్రాంతంలో గతంలో రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, అది ప్రైవేట్ ప్రాంతం కావడంతో దామగుండం అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేశారని విమర్శించారు.

రాడార్‌ను 12 రాష్ట్రాలు వ్యతిరేకించాయి

నేవీ రాడార్ ఏర్పాటుతో అడవిలోని ఔషధ మూలికలు, స్వచ్ఛమైన వాతావరణం, 150 నుంచి 200 రకాల జంతువులు, పక్షులు అంతరించిపోతాయి. ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలోని అనంతగిరిని టూరిజం పేరుతో అభివృద్ధి చేస్తూనే, దామగుండం అడవిని నాశనం చేసేందుకు సిద్ధమైంది. సముద్ర మట్టానికి 360 మీటర్ల ఎత్తులో ఉండటంతో దామగుండం అడవిలో నేవీ రాడార్‌ను ఏర్పాటు చేయాలని 2010లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇలాంటి స్థలాలు దేశంలో చాలా ఉన్నా.. ఇక్కడే ఏర్పాటు చేయడం సముచితం కాదు. రాడార్ ఏర్పాటును 12 రాష్ట్రాలు వ్యతిరేకించాయి. దామగుండం అడవిలో ఏర్పాటు చేస్తే 7 కిలోమీటర్ల వరకు ఉన్న గ్రామాలను ఖాళీ చేయాల్సి వస్తుంది. 27 కిలోమీటర్ల మేర రహదారిని ఏర్పాటు చేస్తే ఈ ప్రదేశంలో మూసీ, కాగ్నా నదులతోపాటు మరో రెండు నదులు కలుస్తాయి. రేడియేషన్ ప్రభావంతో భూమి, గాలి, నీరు కలుషితమవుతుంది. జంతువులు, పక్షులు, ప్రజలు రేడియేషన్ ప్రభావానికి గురవుతారు.

- మురళీధర్ దేశ్‌పాండే, దామగుండం అడవి పరిరక్షణ సమితి అధ్యక్షుడు

ఐదువేల మందితో ఉద్యమం

దామగుండం అటవీ ప్రాంతంలో కొందరి స్వలాభం కోసం నేవీ రాడార్‌ను ఏర్పాటు చేస్తే రానున్న తరాల వారికి ముప్పు తప్పదు. ప్రజలు, జీవరాసులు, పక్షులకు నష్టం వాటిల్లుతుంది. భూమిలోంచి సిగ్నల్స్ వెళ్లడంతో భూగర్భజలాలు సైతం కలుషితమవుతాయి. దామగుండం పర్యావరణ పరిరక్షణ కమిటీకి తోడుగా ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతా. 5 వేల మందితో కలెక్టరేట్‌ను ముట్టడించడంతోపాటు శాసనసభ స్పీకర్, ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు సైతం వినతి పత్రాలను అందిస్తాం. రాడార్ ఏర్పాటుపై జరిగే లాభానష్టాలకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తాం.

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్

నేవీ పాత టెక్నాలజీని వదిలేసి తక్కువ రేడియేషన్ ఉండే శాటిలైట్ ద్వారా సిగ్నల్ చేరవేసే రాడార్‌ను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని సూచించారు. చర్చావేదికలో బీఆర్ఎస్ నేత నాగేందర్‌గౌడ్, దామగుండం అడవి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి టీ రాజేందర్, ప్రకృతి ప్రేమికుడు సత్యానందస్వామి, ప్రొఫెసర్ అన్వర్, దేవనోనిగూడెం వెంకటయ్య, రిటైర్డ్ లెక్చరర్లు ముత్తారెడ్డి, నారాయణరావు, బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేశ్‌పటేల్, తెలంగాణ ఉద్యమ వేదిక నాయకుడు రామన్న, హైకోర్టు న్యాయవాదులు మేకల శ్రీనివాస్, రాము, రిటైర్డ్ టీచర్ సాయన్న, సీపీఎం నాయకులు నర్సింగ్‌రావు, మహిపాల్, రాజలింగం, రాఘవేందర్‌గౌడ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దామగుండం అడవిని రక్షించుకుందాం

రాడార్ ఏర్పాటు కోసం దామగుండం అడవిలోని చెట్లను నరకొద్దని హైకోర్టులో కేసు నడుస్తున్నది. ప్రజలు, పర్యావరణం, జీవరాసులకు ముప్పు వాటిల్లే రాడార్ కేంద్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ దామగుండం పర్యావరణ పరిరక్షణ కమిటీ తరపున పోరాడుతున్నాం. కోర్టుకు కావాల్సిన సాక్ష్యాలను సేకరిస్తున్నాం. ప్రజలంతా ఏకతాటిపై ఉంటే రాడార్ ఏర్పాటును నిలిపేయొచ్చు. 2016లో రాడార్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన సమావేశానికి 10 నుంచి 15 మంది మాత్రమే హాజరు కాగా.. ప్రస్తుత సమావేశానికి చాలామంది రావడం సంతోషకరం. 2010లో సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చిన ఆర్డర్‌ను నిలిపేందుకు హైకోర్టు, సుప్రీంకోర్టులకు సైతం వెళ్తాం. రాజకీయాలు, కుల మతాలకతీతంగా ప్రజలందరూ ముందుకు రావాలి.

-రామ్ చల్లా, హైకోర్టు న్యాయవాది

జీవరాశులకు హాని కలిగించొద్దు

దామగుండం అడవిలోని చెట్లను నరికి ప్రజలు, జీవరాశులకు హాని కలిగించొద్దు. రాడార్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే ఈ ప్రాంత మంతా కలుషితమవుతుంది. 279 కిలోమీటర్ల మేర ఉన్న దట్టమైన అటవీ ప్రాంతాన్ని నాశనం చేయొద్దు. అడవిలోని చెట్లను నరికితే ఆ ప్రాంతంలో ఉన్న జీవరాసులు కనుమరుగవుతాయి. దామగుండం ప్రాంతంలో రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని అడ్డుకోవాలి.

- సత్యానంద స్వామి, దామగుండం ప్రకృతి ప్రేమికులు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే వృక్ష సంపదను పెంచుకోవాలి. దామగుండం అడవిలోని చెట్లను రాడార్ స్టేషన్ ఏర్పాటు పేరుతో నరికేస్తే ప్రజలు, జీవరాసులకు హాని కలుగుతుంది. అడవిలో ఔషధ మొక్కలు చాలా ఉన్నాయి. రాడార్‌తో భూమిపైన ఉన్న జీవాలు, భూమిలో ఉన్న పంటలు, చెట్లు, నదులు కూడా కలిషితమవుతాయి. ప్రజలు రేడియేషన్ బారినపడి.. అనేక రోగాలు వచ్చే ప్రమాదం ఉన్నది.

- ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, హైదరాబాద్

పంచభూతాలే పంచప్రాణాలు!

- పర్యావరణ పునరుజ్జీవంతోనే ఆరోగ్యకర, ప్రశాంత జీవితం
- హృదయ రోగాలు 29 శాతం, క్యాన్సర్లు 21% తగ్గే అవకాశం
- 40% రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట
- వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగా 'వైద్యారోగ్య' బడ్జెట్ ఆదా

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మన ఆరోగ్యం బాగుండాలంటే, రోగాలు రాకుండా ఉండాలంటే ఏం కావాలో తెలుసా? ఇంటాబయట స్వచ్ఛమైన గాలి, స్థిరమైన వాతావరణం, స్వచ్ఛమైన, సరిపడా నీళ్లు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, రసాయనాలను సురక్షితంగా వినియోగించటం, రేడియేషన్ నుంచి రక్షించుకోవటం, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం, పనిప్రదేశాలు శుభ్రంగా ఉండటం, ఆరోగ్యాన్ని సంరక్షించేలా సిటీల నిర్మాణం, పోషకాహారం, సమతుల్య పర్యావరణం ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్తున్నది. ప్రస్తుతం మన చుట్టూ ఉన్న వాతావరణంలో పైన పేర్కొన్న అంశాల్లో ఏ ఒక్కటీ సరైన స్థాయిలో లేవు. ధ్వంసమైన పర్యావరణం, విపరీతమైన వాతావరణ మార్పులతో మన జీవితాలు నిత్యం ప్రభావితం అవుతున్నాయి. ఇవి మనకు శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న మరణాల్లో పర్యావరణ మార్పులతో సంబంధం ఉన్నవి ఎంతో తెలుసా? 24 శాతం. అంటే మరణిస్తున్న ప్రతి నలుగురిలో ఒకరు పర్యావరణ మార్పుల బాధితులే. పర్యావరణ మార్పులతో